## అధ్యయనంతో కూడిన బోధన అందించాలి

**ప్రజాశక్తి -అనంతగిరి:** ప్రాథమిక స్థాయి నుంచే అధ్యయనంతో కూడిన విద్యా బోధన అందిస్తే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే అవకాశాలు ఉన్నాయని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్ఎస్ఎ ఏపీసి స్వామి నాయుడు తెలిపారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన చిలకలగెడ్డ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు అంకితభవంతో బోధిస్తే విద్యార్థులకు గుణాత్మకతతో కూడిన విద్యా బోధనలు అందు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు .రాంబాబు, మల్లేశ్వరరావు, శేఖర్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న స్వామినాయుడు

ర్యాలీ చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, గ్రామస్తులు

# 'హైడ్రో'పై గ్రామసభను అడ్డుకుంటాం

### - ప్రాజెక్టు నిర్మిస్తే గిరిజనుల బతుకులు జలసమాధి -హుకుంపేటలో భారీ ర్యాలీ

**ప్రజాశక్తి -హుకుంపేట:** మండలంలోని భుర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన గ్రామసభను అడ్డుకుంటామని ఆదివాసులు స్పష్టం చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే భుర్జ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల్లో 5 వేల మంది ఆదివాసులు జల సమాధి కావాల్సి వస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం హుకుంపేట మండల కేంద్రంలో వందలాది మంది ఆదివాసులు భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామసభ నిర్వహణకు వ్యతిరేకంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు డి.గంగరాజు, జిల్లా కార్యదర్శి పీ.బలదేవ్ తదితర నాయకులు అడిషనల్ ఎస్పీ నీరజ్ ఐపీఎస్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి వేసిన సర్వే రాళ్లను తొలగించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులను కాపాడే పీసా చట్టం, అటవీ హక్కుల, 1/70 చట్టాన్ని విస్మరించి ప్రైవేట్ సంస్థలకు వేల ఎకరాల అటవి, జీరాయితి భూములు కేటాయించడం అన్యాయమని వారు మండిపడ్డారు.ఈ ర్యాలీలో మండల గిరిజన సంఘం కార్యదర్శి టీ.కృష్ణారావు, పోరాట కమిటీ కన్వీనర్ మజ్జి సురేష్, ఎంపీటీసీ మజ్జి హరి, సిపిఎం నేతల రామారావు పాల్గొన్నారు.

# హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలి

### -అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:** హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌తో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశమై హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని త కోరారు. ఈ పవర్ ప్రాజెక్ట్ చేపడితే అమాయక గిరిజన ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కొండని నమ్మి బ్రతికే సుమారు 15-20 గ్రామాల గిరిజన బతుకులు జలసమాధి అవుతుందని అన్నారు. పవర్ ప్రాజెక్ట్ నిర్మాణంకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 51 రద్దు చేయాలన్నారు.
స్పందించిన జిల్లా కలెక్టర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు మేరకు సర్వే నిర్వహించడం జరుగుతుందని, పేసా, గ్రామసభలో గ్రామస్తుల తీర్మానం, స్థానిక ప్రజా ప్రతినిధుల ఆమోదం లేకుండా ప్రభుత్వం ఎటువంటి నిర్మాణం లేదని ప్రజలు ఎవ్వరు భయపడవలసిన అవసరం లేదని చెప్పారన్నారు.గ్రామస్థుల ఆమోదం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారని తెలిపారు. 1/70 చట్టానికి పేసా,ఇతర గిరిజన చట్టాలకు లోబడి ఉన్నామన్నారన్నారు.

## భారీ యంత్రాల తరలింపు

### -హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికేనా?

**ప్రజాశక్తి -అనంతగిరి:** హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ప్లాంటు నిర్మాణానికి భారీ యంత్రాలు మైదాన ప్రాంతాల నుండి ఏజెన్సీ ప్రాంతానికి శనివారం తరలి వెళ్లాయని స్థానికులు ఆరోపించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు విస్తతంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తూ పోరాటాలను ఉధృతం చేస్తూ సర్వే దిమ్మలను తొలగిస్తున్న ఘటనలు తెలిసిన విషయమే. అయినా భారీ యంత్రాల సామగ్రి తరలి స్తున్నారని స్థానికులు తెలిపారు.

భారీ వాహనంపై తరలిస్తున్న యంత్రం

# శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-పాడేరు :** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యము లో శనివారం వినతిపత్రాన్ని ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింగరావుకి అందజేశారు. సిఐటియు మండల సహాయ కార్యదర్శి సుందర్‌రావు మాట్లాడుతూ, శానిటేషన్ కార్మికులకు 2024 నవంబర్ నెలలో పెంచిన కొత్త వేతన జీవో ప్రకారం రూ.18600 వెంటనే అమలు చేసి, ఏరియర్స్ చెల్లించాలన్నారు. అందరికి ఈపీఎఫ్ నెంబరు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని, సీనియారిటీ ప్రకారం సూపర్ వైజర్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రక్షణ పరికరాలు ఇవ్వాలని, కేంటిన్, బర్త్ వెయిటింగ్ విభాగాలలో కార్మికుల నియామకం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జిల్లా అధ్యక్షులు. ముత్యాలమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పుణ్యవతి, భూషణ్, కార్మికులు చిట్టిబాబు, నగేష్, మణి, మధులత, చిలకమ్మ, సీత, ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

## పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీలు

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** పాడేరు మండలం ఈదుల పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర నాయుడు తనిఖీ చేశారు. పి హెచ్ సి పరిధిలో ఉన్న గ్రామాల రోగులకు అందిస్తున్న వైద్య సేవలను, మందుల నిలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూచనలు అందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు, రికార్డులు నిర్వహణ అంశాలపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పి హెచ్ సిలో నమోదైన మలేరియా కేసులు, అందించిన చికిత్స వివరాలను వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. ఎపిడమిక్ సీజన్‌లో వైద్య సిబ్బంది గ్రామస్థాయిలో సందర్శించి సకాలంలో రోగులకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఆరోగ్య విస్తరణ అధికారులు జి.సింహాద్రి, ఎం.సంజీవ్ పాత్రుడు, హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, డి.కొండలరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

## నిర్వాసితుల తరలింపునకు ఏర్పాట్లు

### -జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**ప్రజాశక్తి -పాడేరు :** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలింపుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా భూములు అందించడానికి భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులు, తహశీల్దారులు, పోలవరం పరిపాలనాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు ప్రత్యామ్నాయ భూములు సేకరణ, పునరావాసంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఎన్ని ఎకరాలకు ప్రతిపాదనలు వచ్చాయని అధికారులను ఆరా తీసారు. పునరావాస కాలనీలకు నిర్వాసితులు సందర్శించడానికి పర్యటనా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్తు, మంచినీటి సదుపాయాలు సమస్యలు పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. రైతులకు సాగుకు అనుకూలంగా ఉన్న భూములు కేటాయించాలన్నారు. జీలుగు మిల్లి, బుట్టాయ గూడెం, కుక్కనూరు గ్రామాల్లో భూములు సేకరించాలని ఆదేశించారు. ఇందుకూరు పేట గ్రామానికి శ్మశాన వాటికకు భూమిని సేకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో పోలవరం పరిపాలనాధికారి వి.అభిషేక్, రంపచోడవరం ఐటిడిఏ పిఓ కె.సింహాచలం, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, చింతూరు పిఓ అపూర్వ భరత్, ప్రత్యేక ఉప కలెక్టర్ అంబేద్కర్, చింతూరు, రంపచోడ వరం డివిజన్ల పరిధిలో పలువురు తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# పోటెత్తిన గోదావరి

గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. క్రమేపీ పెరుగుతూ శనివారం సాయంత్రానికి 47.40 అడుగులకు చేరుకుంది. రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి వద్ద ప్రవహిస్తోంది. దీంతో ముంపు మండలాల వాసులకు కంటి మీద కునుకు లేదు. తిన్న తిండి వంట పట్టదు. కూడూ, గూడూ కరువై ఇరుకు ఇరుకు గదుల్లో చాలీచాలని వసతుల మధ్య బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటిమట్టం
- ముంపులో పలు గ్రామాలు
- బాహ్య ప్రపంచంతో తెగిపోయిన సంబంధాలు
- బోట్లే ఆధారం..
- ముంపులో సోకిలేరు వంతెన
- భద్రాచలం - కూనవరం రహదారిపై నీరు

ఒడ్డుగూడెం కాలనీలో మైక్‌తో ప్రచారం చేస్తున్న విఆర్ఓ

ఎటపాక : నందిగామ వద్ద రహదారిపై చేరిన నీరు

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న వడ్డిగూడెం వాసులు

**ప్రజాశక్తి-వి.ఆర్.పురం:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యే పరిస్థితి అటుంచి ముంపు మండలాల వాసులకు మాత్రం కష్టకాలం తప్పట్లేదు. ఇప్పటికీ పునరావాస కాలనీలు పూర్తికాలేదు. ముందు జాగ్రత్తగా రేఖపల్లి, కోతులుగుట్ట ప్రాంతానికి తరలి వెళ్తు న్నారు. రేఖపల్లిలో చిన్నచిన్న గదులకే రూ.5 వేలు రూ.10 వేల చొప్పున అడ్వాన్సులు తీసుకొని బుక్ చేసుకున్నారు. సామగ్రి సర్దుకుని భద్రాచలం వెళ్లిపోదామంటే రవాణా ఖర్చుల కింద పది నుంచి ఇరవై వేల రూపాయలు ఖర్చవుతాయి. మళ్ళీ అక్కడ అద్దెకు ఒక ఇల్లు తీసుకుంటే పదివేల నుంచి 20వేల వరకు ఖర్చవుతోందని వాపోతున్నారు.

**రాకపోకలు నిలిచిపోయాయి..**

శ్రీరామ్‌గిరి, సీతంపేట, చొక్కనపల్లి, వడ్డిగూడెం, వడ్డీ గూడెంకాలనీ, రామవరం, అడివివెంకన్నగూడెం, రామవరంపాడు, తొష్టివారిగూడెం, చింత రేగుపల్లి, కన్నాయిగూడెం, జీడిగుప్ప, ఇప్పుడు, కోటార్ గొమ్ము, తదితర సుమారు 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామస్తులు పడవను వినియోగిస్తున్నారు. శాశ్వత పునరావాసం కల్పించాలని ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ఇచ్చి ఇక్కడ నుండి తరలించాలని ముంపు ప్రజలు కోరుతున్నారు.

**పది రోజుల వ్యవధిలో రెండో ప్రమాద హెచ్చరిక**

**ఎటపాక:** గోదావరికి వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 47.40 అడుగులకు చేరుకుంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికకు చేరువగా ప్రవహిస్తోంది. మురుమూరు వద్ద భద్రాచలం - కూనవరం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరుకుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ, మురుమూరు, నెల్లిపాక వీరాయి గూడెం గ్రామాల మధ్య రహదారుల పైకి వరద నీరు చేరడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వరద మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పదిరోజుల వ్యవధిలో రెండోసారి గోదావరి తమ గ్రామాన్ని చుట్టుముట్టిందని, రాకపోకలు నిలిచిపోయాయని, నిత్యవసరాలు పంపిణీ చేయాలంటూ వీరయిగూడెం, మురుమూరు గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖరరావు, ఎఒ సుబ్బారావు మురుమూరు వద్ద వరద పరిస్థితిని పరిశీలించి స్థానిక సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు నిరంతరం సమాచారం అందిస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. ఆయన వెంట నందిగామ సర్పంచ్ పులుసు బాలకృష్ణ, నందిగామ పంచాయతీ కార్యదర్శి సురేష్, మురుమూరు పంచాయతీ కార్యదర్శి సునీల్ నందిగామ గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

**ముంపులోనే సోకిలేరు వంతెన**

**చింతూరు:** శబరి నది శాంతించినా కానీ ఇంకా సోకిలేరు వాగులో వరద ఉధతి తగ్గకపోవడంతో చింతూరు విఆర్‌పురం మండలాలకు రహదారి మూసుకుపోయింది. దీంతో రాకపోకలు లేవు. సోకిలేరు వద్ద ఇంకా ప్రజలు పడవ ప్రయాణమే చేస్తున్నారు. కోయగూరు వాగు తగ్గడంతో చత్తీస్‌గడ్, ఒడిశా, ఆంధ్రకు రహదారులు బయటపడ్డాయి. చంద్రవంకవాగు, కుమ్మూరు వాగు, జల్లివారిగూడెం వాగు ఇంకా ఉధతంగానే ప్రవహిస్తున్నాయి. బోర్లలో నీరు కలుషితం కాకుండా అధికారులు క్లోరినేషన్ చేయించాల్సి ఉంది.

సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్‌కి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

### నిత్యావసరాలు అందించాలి : సిపిఎం

**చింతూరు:** వరదకు రాకపోకలు లేని గ్రామాలకు తక్షణమే నిత్యావసరాలు అందించాలని, ప్రతి కుటుంబానికి దోమతెరలు పంపిణీ చేయాలని, ఏజీ కోడేరు కేంద్రంలో బోటు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కమిటి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్‌కి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ వరదల వలన ఏజీ కోడేరు, ముకునూరు, కల్లేరు, పీఎస్‌పల్లి, రామన్నపాలెం పంచాయితీల గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయని, 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారికి నిత్యావసరాలు అందించాల న్నారు. ఎజి కోడేరు కేంద్రంగా ఆ మూడు గ్రామాల సౌకర్యార్థం ఒక బోటు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్‌కి అందించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ కేజీ కోడేరులో నిత్యావసరాలు అందిస్తామని మిగతా గ్రామాలకు కూడా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు సీసం సురేష్, పొడియం లక్ష్మణ్, మొట్టమ్ రాజయ్య, కారం నాగేశ్వరరావు, కూర లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని మృతి

### వార్డెన్, ఎఎన్ఎం సస్పెన్షన్

**ప్రజాశక్తి- రంపచోడవరం :** మారేడుమిల్లి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న చదల దివ్యతేజ మతికి కారణమైన వారిని సస్పెండ్ చేయాలని కోరుతూ, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని రంపచోడవరం ఏరియా ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఐటిడిఎ పిఒ సింహాచలం బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆరోగ్య సమస్యల వల్లనే బాలిక మృతి చెందిందని ఆయన అనగా కుటుంబీకులు స్పందించి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బాలిక హాస్టల్ బాత్రూంలో కాలు జారి పడి గాయమైందని అప్పుడు 2 వాంతులు కూడా అయ్యాయని అయినా హాస్టల్ సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదన్నారు. మరల ఉదయం అపస్మారక స్థితిలో ఉండడంతో హాస్టల్ వాచ్‌మెన్, కుక్ బాలికను మారేడుమిల్లిలోని ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. అక్కడనుండి రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారని రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో బాలిక మతి చెందినట్టు నిర్ధారించారు. అయితే ఇంత జరిగినా తమకు ఎటువంటి సమాచారం అందించలేదని అన్నారు. బాలిక మతికి కారణమైన వార్డెన్, ఎఎన్ఎంను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అప్పటికే ఐటిడిఎ పిఒ మారేడుమిల్లి వెళ్లి అక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడానని విషయం తెలుసుకున్నానని మారేడుమిల్లి పిహెచ్‌సి వైద్యుని సస్పెండ్ చేస్తామని పిఒ చెప్పగా బాలిక తల్లిదండ్రులు వార్డెన్‌ను, ఎఎన్ఎంను సస్పెండ్ చేయాలన్నారు. బాలిక అనారోగ్య కారణంగా చనిపోయిందని పిఒ చెప్పగా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, నాయకులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి, దూడ ప్రణీత, ఆదివాసీ ఐక్యవేదిక సంక్షేమ సంఘం అధ్యక్షులు వెదురుల లచ్చిరెడ్డి, బాలిక కుటుంబ సభ్యులు పిఒను నిలదీశారు. దీంతో పిఒ బాలిక కుటుంబ సభ్యులను తీసుకుని రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుండి మారేడుమిల్లి ఆశ్రమఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం ఏరియా ఆసుపత్రికి వచ్చి విద్యార్థిని మృతికి కారణమైన వార్డెన్, ఎఎన్ఎంను సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. దీనితో కుటుంబ సభ్యులు దీక్ష విరమించి పోస్ట్‌మార్టం చేయడానికి అంగీకరించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని అప్పగిస్తామని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై రంపచోడవరం ఎటిడబ్ల్యూఒ నాగజ్యోతి మాట్లాడుతూ రంపచోడవరం ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు మారేడుమిల్లి ఆశ్రమ పాఠశాల వార్డెన్ ఎఎన్ఎంలను సస్పెండ్ చేస్తున్నామని బాలిక కుటుంబీకులకు అంత్యక్రియల నిమిత్తం రూ.50 వేలు అందిస్తున్నామని తెలిపారు.

ఆందోళన చేస్తున్న బాలిక కుటుంబసభ్యులు, ఇన్‌సెట్‌లో బాలిక (ఫైల్ ఫొటో)

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి:** జడ్డంగిలో వాల్మీకి తెగకు చెందిన పులిమెట్ల కాసులమ్మ మృతి చెందిన నేపథ్యంలో ఆదివాసి వాల్మీకి సంక్షేమ సంఘంలో ఆమె సభ్యురాలుగా నమోదై ఉన్నందున జిల్లా ఆదివాసీ వాల్మీకి సంక్షేమ సంఘం ఆదేశాల మేరకు మండల కమిటీ అధ్యక్షులు వజ్రపు అప్పారావు, జిల్లా కార్యదర్శి రాళ్ళగడ్డ అర్జున్ జడ్డంగి గ్రామ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో శనివారం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ వాల్మీకి సంక్షేమ సంఘం జడ్డంగి గ్రామ కమిటీ సభ్యులు ముంగారి గణపతి, మద్దికొండ కృష్ణ, బారంగి రాజబాబు, పులిమెట్ల మోహనరావు, మఠం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న వజ్రపు అప్పారావు తదితరులు

# మార్గదర్శకులను గుర్తించాలి

## కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మార్గదర్శులు, బంగారు కుటుంబాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ నియోజకవర్గ స్పెషల్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాల వివరాలపై మండలాల వారీగా ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేటికీ జిల్లాలో 352 సచివాలయాలకు గాను 329 సచివాలయాలు కవర్ అయ్యాయని, అందులో 16,050 కుటుంబాలకు సంబంధించి 1,24,557 మందికి పి 4 కింద దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. డుంబ్రిగూడ, ముంచింగి పుట్ మండలంలో పురోగతి బాగా లేదని వేగవంతం చేయాలన్నారు. మండలం స్థాయిలో మండలం ప్రత్యేక అధికారి పూర్తి బాధ్యతలు వహించాలన్నారు.అధికారులు సమన్వయంతో మార్గదర్శులను గుర్తించి బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని టార్గెట్గా పెట్టుకొని వేగవంతం చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు దృష్టి సారించి వేగవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ అధికారులు కె.సింహాచలం, అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జిల్లా పి 4 ప్రత్యేక అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, డిఆర్డిఎ పిడి వి.మురళీ, డ్వామా పిడి విద్యాసాగర్, ముఖ్యప్రణాళికాధికారి పి.ఎస్.ఎల్.ప్రసాద్, రహదారులు భవనాల శాఖ ఈఈ బాల సుందర బాబు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్ పాల్గొన్నారు.

**మౌలిక వసతులు కల్పించాలి**

పాడేరు : మౌలిక వసతులు కల్పన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు.పాడేరులో ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. నేటికీ చేపట్టిన పనుల పురోగతి పై ఆరా తీశారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లైబ్రరీ తరగ స్టూడెంట్స్ కి అందుబాటులో ఉంచాలన్నారు. బాస్కెట్బాల్ వాలీబాల్, షటిల్ కోర్టులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత దేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ కుమారి, ఏపీ ఎంఎస్ ఐడీసీ ఈ.ఈ అచ్చం నాయుడు, డిఈఈ, ఎస్ సిస్, ఏఈఏం మధుబాబు తదితరులు ఉన్నారు.

# విఎంఎల నూతన కమిటీ ఎన్నిక

ఎన్నికైన భాను, రాజ్కుమార్

ప్రజాశక్తి -పాడేరు: వెలుగు యానిమేటర్ల (విఎంఎల) జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైంది. మినుములూరులో రెండవ మహా సభ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ బి పోతురాజు సమక్షంలో శుక్రవారం ఈ నూతన కార్యవర్గం ఏర్పడింది. అధ్యక్షులుగా ఆర్.భాను (పాడేరు), కార్యదర్శి గా ఎల్పీ రాజ్ కుమార్ (అరకు) ట్రెజరర్గా పోతురాజు(ముంచంగిపుట్టు), ఉపాధ్యక్షులుగా భాస్కరరావు (డుంబ్రిగుడ), జాయింట్ కార్యదర్శిగా జ్యోతి (ముంచంగిపుట్టు) కమిటీ సభ్యులుగా .రవి(అనంతగిరి) చిన్నబాబు, (అరకువాలీ), సూరిబాబు,(హుంకుంపేట), దుర్గదేవి(ముచింగ్ పుట్టు), రాజు(పెదబయలు) మహేష్ (.జి.మాడుగుల), సువర్ణ (పాడేరు), శోభన్( జీకే.వీది), మలేష్ (కొయ్యూరు), దుర్గ(చింతపల్లి). కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూఉద్యమాలు చేపడతామన్నారు. ఈ ఎన్నికలో సిఐటియు సహాయ కార్యదర్శి సుందరరావు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల నాయకులు శ్రీనివాస్ శనివారం డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో పంచాయితీ కార్మికులు, గ్రీన్అంబాసిడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తాటితురి శ్రీనివాస్ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 2 నెలల వేతనం పెండింగ్లో ఉందన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్లుగా కనీస వేతనాలు 21 వేలు ఇవ్వాలని, 551 జిఒ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాండవుల సత్యనారాయణ, చేతివృత్తిదారు సమన్వయ కమిటీ సభ్యులు ఎర్రవరం శ్రీను, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## 150 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - వై.రామవరం: వై.రామవరం మండలం, డొంకరాయి పోలీస్స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. డొంకరాయి ఎస్ఐకి వచ్చిన సమాచారం మేరకు మర్రిగూడెం గ్రామ శివారులో ఒడిస్సా రాష్ట్రానికి మూడు ప్లాస్టిక్ బస్తాల్లో రూ.7.5 లక్షలు విలువ చేసే 150 కిలోల గంజాయిని ఒడిశా రాష్ట్రంలో దళారులకు తరలిస్తున్న వంతల బలరామును విచారించిన అనంతరం అరెస్ట్ చేశారు. చింతూరు సిఐ గోపాలకృష్ణ ముద్దాయి వంతల బలరామును రిమాండ్కి తరలించారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

## ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దారకొండలో ఎరువులు అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం మండల నాయకులు పాంగి నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానికులు విలేకరులతో శనివారం మాట్లాడుతూ ఎరువులు కొనాలంటే గిరిజనులకు తలకు మించిన భారంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్తా యూరియా రూ.450కు వ్యాపారులు విక్రయించాల్సి ఉండగా రూ.950కి విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: కూటమి ప్రభుత్వంలో ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి, సంక్షేమం శూన్యమని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆరోపించారు. శనివారం రాజవొమ్మంగి లో వైసిపి మండల అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ అధ్యక్షతన ఎంపిపి గోము వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, రంపచోడవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కుంటుపడిం దన్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఆమె భర్త విజయభాస్కర్ అవినీతి రోజురోజుకీ పెరిగిపోతోందన్నారు. వైసీపీ నాయకులను, కార్యకర్తలు పోలీసులు ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రకాష్, వైసిపి నేతలు ఎంపిటిసిలు, సర్పంచులు వైసిపి నేతలు పాల్గొన్నారు.

# ఉచిత బస్సుతో మహిళలకు ఆర్థిక భరోసా

## ఆర్టిసి రీజనల్ బోర్డు చైర్మన్ దొన్ను దొర

బస్సులో మహిళలతో మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీశక్తి పథకంతో మహిళలకు ఆర్థికంగా ఎంతో భరోసా లభిస్తుందని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ బోర్డు చైర్మన్, అరకు నియోజకవర్గ ఇంచార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. శనివారం అరకులోయ మండలం పద్మాపురం పంచాయితీ రిసార్ట్స్ లో జరిగిన స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమం ఏపీఎస్ ఆర్టీసి చైర్మన్ దొన్ను దొర ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 5 వేల మంది మహిళలు హాజరయ్యారు . దొన్నుదొర ఆర్టీసి బస్సు ఎక్కి ఉచిత బస్సు సౌకర్యం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర జిసిసి చైర్మన్,మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మహిళల భద్రత, సంక్షేమం, అభివృద్ధి విషయంలో వెనకడుగు వెయ్యదని తెలిపారు.ఉచిత బస్సు సౌకర్యం మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎస్ ఆర్టిసి చైర్మన్ సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం స్త్రీ శక్తి పథకంపై అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచి పెట్టెలి దాసుబాబు, అరకు లోయ టిడిపి మండల అధ్యక్షుడు మహాదేవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బిబి లక్ష్మీ, మహిళా సంఘం నాయకురాలు ద్రౌపది, నిర్మల, బూర్జ లక్ష్మి అరకులోయ మాజీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, వివిధ మండల అధ్యక్షులు కార్యకర్తలు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సమ్మిళిత విద్యను చేరువ చేయాలి

## రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు ప్రొఫెసర్ సుజాత మాలిని

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎయు విసి రాజశేఖర్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సమ్మిళిత విద్యను చేరువ చేసే దిశగా కృషి చేయాలని రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు, ఆంధ్ర యూనివర్సిటీ స్పెషల్ ఎడ్యుకేషన్, రిహాబిలిటేషన్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య జి. సుజాత మాలిని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యావిభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఎన్ఇపి 2020 విత్ స్పెషల్ రిఫరెన్స్ టు స్పెషల్ ఎడ్యుకేషన్' అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులను ఉద్దేశించి వర్చువల్ మాట్లాడుతూ పాఠశాల అనేది వైవిధ్యమున్న చిన్నారుల చిన్నపాటి సమాజమని, వీరి అవసరాలకు అనుగుణంగా తగిన సమ్మిళిత విద్యాబోధన అవసరమన్నారు. ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు అనువైన వాష్ రూమ్లు, ర్యాంప్లు, మౌలిక వసతుల ఏర్పాటుతో వారికి అవసరమైన విద్య విధానాలను చేరువ చేయడం సాధ్యపడుతుందన్నారు. ఇంటినుంచే చదువుకునే అవకాశం, ఓపెన్ స్కూలింగ్ వంటివి వారిని ఉన్నత విద్య దిశగా నడిపిస్తాయన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్లు ఏర్పాటు కావాలని, కరికులంలో సరళత ఉండాలని సూచించారు. జాతీయ విద్యా విధానం లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అట్టడుగుకు తీసుకెళ్లేందుకు ఇటువంటి శిక్షణలు దోహదపడతాయన్నారు. ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూతనఅనుభవాలను పంచుకుంటూ, ప్రత్యేకఅవసరాలు కలిగిన విద్యార్థులకు బోధన విధానాన్ని వివరించారు. కాలానుగుణంగా నూతన బోధన విధానాలు, సాంకేతికతలు అందుబాటులో వస్తున్నాయని,వీటిపై అవగాహన, నైపుణ్యాలను పెంచుకుని బోధనలో అమలు చేయాలన్నారు.ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ నిరంతరం సామర్థ్యాలను పెంపొందించుకుని బోధనలో అమలు చేయాలన్నారు. ఎయు విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ వ్యక్తిగత అభివృద్ధితో పాటు నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించ దానికి ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. అనంతరం ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య డి.నగరాజ కుమారి, డాక్టర్ ప్రకాష్ రచించిన 'స్పెషల్ ఎడ్యుకేషన్ అండ్ మల్టిపుల్ డిజెబిలిటీస్' పుస్తకాన్ని ఎయు విసి ఆచార్య జి.పి రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం రిసోర్స్ పర్సన్స్ను సత్కరించారు. కార్యక్రమంలో ఐఎఎస్ఇ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజ కుమారి, డాక్టర్ ఆలీ, డాక్టర్ ఎంవిఎస్ఎస్ ప్రకాష్, డాక్టర్ ప్రవీ దేవి, డాక్టర్ రాము పాల్గొన్నారు.

# ఎఒగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ

మండల వ్యవసాయాధికారి సుధాకర్

ప్రజాశక్తి-హుకుంపేట: మండల అగ్రికల్చర్ అధికారి కే.సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విజయనగరం సహా మూడు మండలాల్లో పని చేశానని ఆయన తెలిపారు.ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. ప్రస్తుతం యూరియా లోడింగ్, అన్లోడింగ్లో ఇబ్బందులు తలెత్తాయని, దీంతో సరఫరా నిలిచి పోయాయని తెలిపారు. 10 టన్నుల యూరియా స్టాక్ త్వరలో రానుందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట క్రాప్ నమోదు చేసుకోవాలని, వారికి బీమా సౌకర్యం లభిస్తుందని స్పష్టం చేశారు.

# బురదమయమైన అంతర్రాష్ట్ర రహదారి

బురదలో కూరుకుపోయిన లారీ

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు పిల్లిగెడ్డ అంతర్రాష్ట్ర అప్రోచ్ రహదారి బురదమయంగా తయారైంది. దీంతో లోడ్ లారీలు బురదలో కూరుకుపోతున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పిల్లిగెడ్డ వంతెనకు నిధులు మంజూరయ్యాయి. వంతెన పనులు అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయలేదు. సంబంధిత కాంట్రాక్టర్తో అధికారులు తూతూ మంత్రంగా వంతెనకు ఇరువైపులా అప్రోచ్కి మట్టి వేయించి శాశ్వత రహదారి నిర్మించకుండా చేతులు దులుపుకున్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి అత్యవసర సమయంలో వైద్యసేవలు పొందాలన్నా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకోవాలన్నా అటు చిత్రకొండ ఇటు సీలేరు వెళ్లవలసి ఉంటుంది. రహదారి అస్తవ్యస్తంగా తయారవడంతో సరిహద్దు ప్రాంత ప్రజలు ఆందోళన గురవుతున్నారు. శాశ్వత రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టకపోతే ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# సిసిఆర్టి శిక్షణా తరగతులకు బడదాం ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం మట్లపాడు పంచాయతీ బడదాం ఎంపిపి స్కూల్కి చెందిన సడేల నాగప్రసాద్ రాజస్థాన్లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులకు ఎంపికయ్యారు. ఉదయ్పూర్లో సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల నుండి ఎంపిక చేయబడిన 90 మంది ఉపాధ్యాయులకు రోల్ ఆఫ్ పప్పెట్రీ ఇన్ ప్రైమరీ ఎడ్యుకేషన్ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. శిక్షణ ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10 వరకూ కొనసాగుతుంది. ఈ శిబిరంలో భాగంగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తమ ప్రాంతీయ సాంస్కృతిక ప్రదర్శనలు అందిస్తుండగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్కు చెందిన ఉపాధ్యాయ బృందం నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో మన రాష్ట్ర సాంస్కృతిక వారసత్వ సంపద గురించి పిపిటి ప్రదర్శన కోలాటం, ధింసా నృత్యం, జానపదగానం ఇలా అనేక ప్రదర్శనలు చేసి మన రాష్ట్ర గొప్పతనం గురించి ప్రాంతీయ ప్రదర్శన ఇచ్చారు.

# షూటింగ్కు అనుకూలమైన ప్రదేశాల పరిశీలన

పరిశీలిస్తున్న డైరెక్టర్ శివ బృందం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో సినిమా షూటింగ్కి అనుకూలమైన ప్రదేశాలను శనివారం ప్రముఖ డైరెక్టర్ శివ తన బృందంతో కలిసి పరిశీలించారు. ఇటీవల సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని మోతుగూడెం డొంకరాయి సీలేరు పరిసర ప్రాంతాల్లో అగ్రహీరో నటించిన పుష్ప, పుష్ప-2, అఖండ వంటి సినిమాలు చిత్రీకరించారు. అవి సూపర్హిట్ కావడంతో ఇక్కడ ప్రకృతి రమణీయమైన దృశ్యాలు సినిమా షూటింగ్కు అనుకూలమని సినీ డైరెక్టర్లు దృష్టికి వెళ్లిన నేపథ్యంలో నిన్నుకోరి, మజిలీ, టక్ జగదీష్, ఖుషి వంటి సూపర్ హిట్ సినిమాలు తీసిన యువ డైరెక్టర్ శివ నిర్వహణలో తాజాగా రవితేజతో తీయబోయే సినిమాకు సీలేరులో అనుకూలమైన ప్రదేశాల కోసం తన బృందంతో కలిసి శనివారం పరిశీలించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయము ప్రాంగణం, రామాలయం సెంటర్, సీలేరు మార్కెట్, ఏపీ జెన్కో గెస్ట్ హౌస్, ఎస్ఇ బంగ్లా ప్రాంతాలను సందర్శించి వీడియో చిత్రీకరణ చేశారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో అనుకూలమైన ప్రదేశాలను స్థానిక బాలాజీ రెస్టారెంట్ ఓనర్ బాల, కారె శ్రీనివాస్ ఈ బృందానికి చూపించారు. నవంబర్లో సినిమా షూటింగ్ సీలేరులో తీయవచ్చునని యువ డైరెక్టర్ శివ పేర్కొన్నారు.

# మారెల్ల శ్రీనాథ్కు డిస్ట్రిబ్యూటర్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :

భారత్లో ఫుట్వేర్ బ్రాండ్లలో ఒకటైన ఏషియన్ ఫుట్వేర్స్ తన బ్రాండ్ అంబాసడర్ క్రికెటర్ ఎంఎస్ ధోనీ చేతుల మీదుగా సిగ్నేచర్ రేంజ్ 'క్వాంటమ్ 2.0' పేరుతో కొత్త ప్రీమియం షూస్ కలెక్షన్ను విడుదల చేసిందని, ఏషియన్ ఫుట్ వేర్స్ ప్రతినిధి రాజేందర్ జిందాల్ తెలిపారు. నగరంలో ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం 3 వేల రిటైల్ ఔట్లెట్ల నుంచి 8 వేల దుకాణాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక బ్రాండ్ ఔట్లెట్ల సంఖ్యను కూడా పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఏషియన్ ఫుట్వేర్స్ ప్రధాన డిస్ట్రిబ్యూటర్లలో ఒకరైన విశాఖపట్నం పరిటీం ప్యారగాన్కి చెందిన మారెల్ల శ్రీనాథ్కు, ఎం.ఎస్.ధోనీ చేతుల మీదుగా డిస్ట్రిబ్యూటర్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్లో ఏషియన్ ఫుట్వేర్స్ వ్యాపారాన్ని బలోపేతం చేయడంలో, వినియోగదారుల అనుబంధాన్ని మరింతగా పెంచడంలో సంస్థ అభివద్ధి ప్రయాణాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో వీరి పాత్ర ఎంతో విశేషమైందన్నారు. ఏషియన్ ఫుట్వేర్స్ బ్రాండ్ అంబాసడర్ ఎంఎస్ ధోనీ మాట్లాడుతూ కాలక్రమేణా ఈ బ్రాండ్ ఎలా అభివద్ధి చెందిందో, కొత్త ఆవిష్కరణలు ఎలా చేసిందో చూశానన్నారు.

# పిఆర్ఒ రాములుకు ఘన సత్కారం

రాములును సత్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి పాడేరు: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా అంతకిత భావంతో డివిజనల్ పౌర సంబంధాల అధికారి, సహాయ ప్రాజెక్టు అధికారిగా రాములు ఉత్తమ సేవలను అందించారని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. శనివారం డివిజనల్ పి ఆర్ ఓ రామలు ఉద్యోగ విరమణ సందర్భంగా డ్రైవర్ కన్నబాబును కలెక్టర్ చాంబర్ లో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు, సమావేశాలు, ప్రెస్మీట్లు ఏర్పాటు, మీడియా సమన్వయంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బి.ఎం.సింగ్ మాట్లాడుతూ,సమాచార శాఖ లో ప్రభుత్వ ఉద్యోగం పొందిన దగ్గర నుండి పదవీ విరమణ వరకు విధుల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా రామలు మాట్లాడుతూ, అధికారులు, ప్రాత్రికేయుల సహకారంతో విజయవంతంగా విధులు నిర్వహించానని అన్నారు. సమాచార శాఖలో సేవలందిస్తున్న మరొక ఉద్యోగి డ్రైవర్ ఎ. కన్నబాబు పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు పి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ కె. సంధ్యా రాణి, కార్యాలయం సిబ్బంది పుష్ప ,వరలక్ష్మీ బహదూర్ తదితరులు సహాయకులు పాల్గొన్నారు.

# గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి

ర్యాలీ చేపడుతున్న నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-పెదబయలు : గోమంగి కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ 17 పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, గోమంగి మండల సాధన సమితి నాయకులు, ఆయా పంచాయతీల పెద్దలు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి కొమ్మ పృథ్వీరాజ్, ఇతర నాయకులు మాట్లాడుతూ గోమంగి మండలం ఏర్పాటు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ఉన్న పంచాయతీలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

మాజీ ఎంపిపి జెస్సింగి సూర్యనారాయణ మాట్లాడుతూ తాను ఎంపిపిగా ఉన్నప్పుడు పెదబయలు మండల సర్వసభ్య సమావేశంలో గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సమితి గౌరవాధ్యక్షులు కూడా బొంజుబాబు, గంపరాయి ధనుంజయ్, కూడ రాధాకృష్ణ, కొంట్ట సూర్యనారాయణ, రుంజల సింహం, కొమ్మ అనంత పద్మనాభం, కొమ్మ బాలరాజు, మచ్చకొండ బాబు, కూడా కళ్యాణం, బూడిద చిట్టిబాబు, పురుషకారి భాస్కరరావు, కోర్ర సత్తిబాబు, గుల్లేలు జమ్మనాయుడు, కొంట్ట నవీన, కూడా ప్రసాద్, బోర్ర అప్పన్న, చిట్టిబాబు, జడ్డి పెద్దారావు, వివిధ పంచాయతీల పెద్దలు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న సాధన కమిటీ నాయకులు

## ధారకొండను మండల కేంద్రం చేయాలి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దారకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మండల సాధన కమిటి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి తారకొండలో శాంతియుతంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ నాయకులు సుంకర విష్ణుమూర్తి మార్కురాజు కారె శ్రీనివాస్ మాట్లాడుతూ దారకొండ, సీలేరు, దుప్పిలివాడ, గుమ్మిరేవులు తదితర పంచాయితీలు అభివృద్ధికి నోచుకోలేదని మండల కేంద్రం ఏర్పాటు చేస్తే పంచాయితీ పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.కొన్ని ప్రభుత్వ పాఠశాలలో నేటికీ ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమైపోయారని వాపోయారు. ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి దారకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మండల కేంద్రం సాధించేవరకు శాంతియుతంగా ఉద్యమాన్ని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు ప్రజలు రాజకీయ నాయకులు గిరిజన సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 14న నేవీ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: వైజాగ్ నేవీ మారథాస్ 14 డిసెంబర్ 2025 న నిర్వహిస్తున్నామని వైజాగ్ నేవీ మారథాస్ రేస్ ఆర్గనైజర్ కమాండింగ్ ఆఫీసర్ ఇంయేన్ ఎస్.కళింగ కమాండర్ అనిరుద్రాయ్ ప్రకటించారు. శనివారం డాల్ఫిన్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైజాగ్నేవీమారథాస్ 10వ ఎడిషన్కు సంబంధించిన వివరాలను తెలిపారు. 2014 నుండి ఈ మారథాన్ ను నిర్వహిస్తున్నామని 10వ ఎడిషన్ వైజాగ్నేవీ మారథాస్ ఎంతో ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో పాల్గొనాలనుకునేవారు vizagnavymarathon.runలో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. ఈ మారథాస్ కు అధికారిక టైటిల్ స్పాన్సర్గా ఎస్బిఐ వ్యవహారిస్తుందని తెలిపారు. ఈ మారథాస్ బీచ్రోడ్లోని విశ్వప్రియ ఫంక్షన్ నుండి మొదలై ఐఎన్ఎస్ కళింగ వరకు సాగుతుందని తెలిపారు. అనంతరం జివిఎంసి కమీషనర్ కేతన్గార్గ్ మాట్లాడుతూ వైజాగ్ నేవీ మారథాస్లో పాల్గొనే వారి సంఖ్య క్రమేణ పెరుగుతూ వస్తుందన్నారు. మారథాన్ రిజిస్ట్రేషన్ను జివిఎంసి కమీషనర్ కేతన్ గార్గ్ అధికారికరికంగా ప్రారంభించారు. ఈ వెబ్సైట్ సెప్టెంబర్ 1 సోమవారం నుండి అందరికి అందుబాటులో ఉంటుందన్నారు. ఐఎన్ఎస్ కళింగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, వి.కె.తివారీ, రేసు డైరెక్టర్ టిఆర్ఎస్ కుమార్, నేవీ డిఫెన్స్ పిఆర్ఓ కెప్టెన్ సుజిత్ రెడ్డి , ఎస్బిఐ డిజిఎం రాహుల్ సంక్రిత్య పాల్గొన్నారు.

## నివాబుపాతో బీమా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ తన తాజా ఫ్లాగ్షిప్ ప్రొడక్ట్ రిఅష్యూర్ 3.0ను ప్రారంభించిందని, దీనితో అపరిమిత బీమా కవరేజీ ఉంటుందని, నివా బూపా డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ భబతోష్ మిశ్రా తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఈ విప్లవాత్మక ఆవిష్కరణలో మొదటిసారిగా అన్ లిమిటెడ్ బేస్ సమ్ ఇన్స్యూర్డ్ అందిస్తోందన్నారు. కేవలం రక్షణ మాత్రమే కాకుండా వెల్నెస్ ఆఫరింగ్లతో కూడిన ఆరోగ్య బీమా ఉత్పత్తుల కొత్త యుగానికి నాంది పలుకుతోందన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, శనివారం చైర్మన్ కం జిల్లా ప్రధానన్యాయమూర్తి చాంబర్స్లో చిన్నంశెట్టిరాజు, జుడీషియల్ అధికారులతో భౌతికంగా,అన్ని మండలాల జుడీషియల్ అధికారులతో వర్చువల్ గా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్అదాలత్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. జిల్లాలో వచ్చే నెల 13 న జరగనున్న జాతీయ లోక్అదాలత్ ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించాలన్నారు.